# కవితా కౌముది

## చిరస్మరణీయం
రవిప్రసాద్ చెలమల్లు

ఏళ్లుగా వెతుకుతూ వెళుతూ ఉంటే
వరమల్లే ఓ రోజు వస్తుంది
నిర్భయం, నిశ్శబ్దం, నిలిచిపోయే కాలం
కలగలిపి కోరుకున్న ఏకాంతంలో
నడుస్తూ నడుస్తూ ఉండగా
బాసటగా నిలిచే బంధం ఒకటి
చేయిపట్టి ఆపినప్పుడు
ఉచ్ఛ్వాస, నిశ్వాసలు నిలబడిపోయి,
వళ్ళంతా చెవులుగా మారిపోయి
సడి చేయకుండానే స్పర్శ వినపడుతుంది
రెండు కళ్ళూ...రెప్పలు విచ్చుకుని
కన్నుల సైగలు వింటాయి..!
శబ్దం వ్యర్థం అయిన చోట
చెలిమి మారాకులు వేస్తుంది
కురవని వెన్నెల, వెరవని చీకటి,
ఫలించిన నిరీక్షణ - మనసుకు తెలుస్తుంది.

★★★

## క్షమాపణ
శ్రీనివాసరావు బారు

అణిచాననుకున్న అహం
అనుకోకుండా తలెత్తుతుంది
అనరాని మాట ఏదో
నోటినుంచి జారుతుంది
రైలు ప్రయాణంలో దీపంలా
ఎంత గింజుకున్నా మాట తిరిగిరాదు
ఏదో తప్పు చేశామన్న దుగ్ధ
ఎన్ని రాత్రులయినా మనసు మరచిపోదు ..!!
చాలాసేపు నే మౌనంగానే ఉన్నా
మాటవరసకు మాత్రమే ఏదో అన్నా
అపార్థంతో మా మధ్య ఆమడల దూరం
పరుషంగా పదాలతో గుండెల్లో గాయం
అర్థంకాని కాఠిన్యాన్ని
ప్రశ్నించినా జవాబు రాదు
కళ్ళల్లో ఉబికే తడి
ఏళ్లయినా ఎండిపోదు..!!
దశాబ్దాల అనంతరం
అవుతుందో సత్యదర్శనం
సువిధం, మరి సులభం
సుహృదం, అది సుఖదం..!!
కొంతమందిని క్షమించమని అడిగేశా
మరి కొంతమందిని క్షమించి వదిలేశా ..!!

★★★

# ప్రేమైకరూపాలు

అనూరాధ బండి

చూపులు ఇరుక్కుపోయాక
ఊపిరాడని కళ్ళు మరణిస్తాయి.
ప్రేమ వేటినైనా సమాధి చెయ్యగలదు.

చలనం ఉండడాన్ని ప్రేమ అంటారో..
నిర్జీవనిశ్చలత్వాన్ని ప్రేమ అంటారో..
ప్రేమని పీల్చిపిప్పిచేసిన తరువాయి.. స్వతత్వాలు మారుమ్రోగుతాయి గుండెగదుల్లో..

ఇదిగో, ఇప్పుడు ఇక్కడ చీకటి పాతాళమంతలోతుకి పాతుకునిఉంది.. ఒక్కసారి చూడూ అని ఎవరైనా
అంటే,..నువ్వు ఒక్కటే చెప్పు..
వెలుగుని ప్రవహించే నరాలు
ఉత్తేజాన్ని కలిగిన కండరాలూ ఉన్నప్పుడు
చీకటికి చోటెక్కడా అని.

నీ నవ్వుల్లో సీతాకోకచిలుకల్ని పట్టుకోలేనివారందరూ
నీ ఏడుపుకి గొడుగుని పట్టి
నీలో మిగిలున్న రంగుల్ని పట్టిపట్టి చూస్తారు..
పట్టించుకునేవి పట్టువిదిలించుకునేవీ తెలియాలి నీకు.

నానారకవివర్ణప్రదర్శనలతో రంగులభ్రమని నాటకీయంగా కురిపించి,
రంగస్థలంలాంటి ఈ ప్రపంచాన్ని మరింత రక్తికట్టించాలని చేసే ఎవరి ఏ ప్రయత్నాలూ ఎక్కువకాలం
కొనసాగలేవు.

అంతిమంగా ప్రేమ పరిణతినిపొంది
మనుషుల్ని మరణంనుండీ విముక్తుల్నిచేస్తుంది.
గాజుకళ్ళతో అభావంగా చూసే ఏ ఒక్కరూ అక్కడ ఉండరప్పుడు. ★★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

అందరును మనవారలే యవని యందు
వసుధనందరు మనవంటి వారు కారె?
ఆత్మయో మానసమొ యొక్కటందరికిని
ఆత్మలన్నింట మన యాత్మనరయగలము

ఆన్ని యోచనలెరుగుదురందరున్ను
మంచి చెడులను తెలియని మనసు లేదు
స్వార్థమైనను నిస్స్వార్థ భావమైన
తలపు తర్కమ్ములొకటె మస్తకములందు

అంతరంగములోననున్నట్టి యాత్మ
అంతకంతయై వేయింతలై చెలంగి
ప్రతిఫలించును భువినన్ని ప్రాణులందు
ఎల్లవారిలో మనము వసింతుమేమొ!

అందరిని మన మనసులోనరయునపుడు
అందరి మనస్సుల మనలనరయునపుడు
స్వార్థము నశించు ద్వేషము సన్నగిల్లు
అందరును మంచివారలే యగుదురవని

సూక్ష్మమైపోవు దృష్టి లోచూపునందు
వెలికి చూడగ తోచును విశ్వమెల్ల
ఇట్టి వెలిచూపె సర్వుల యెడదలందు
నిలచి యున్నచో జగతి మంగళమయమ్ము

COMMENTS